సాక్షి
పల్నాడు
బుధవారం, 2, ఆగస్టు, 2023



రవాణా శాఖ అధికారుల దాడులు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనాలపై ఆర్టీఓ అధికారులు కొరడా ఝుళిపించారు. మంగళవారం 56 వాహనాలను సీజ్ చేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో పులిచింతల ప్రాజెక్టు మంగళవారం సాయంత్రానికి 33.7120 టీఎంసీలకు చేరింది.



662 మంది సర్టిఫికెట్ల పరిశీలన

విజయవాడ: ఏపీ ఈఏపీ సెట్-2023 కౌన్సెలింగ్‌లో భాగంగా స్పెషల్ కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. మంగళవారం 662 మంది సర్టిఫికెట్లు పరిశీలించారు.

న్యూస్‌రీల్

పల్నాడులో 54.13 శాతం పెన్షన్ పంపిణీ




నరసరావుపేట రూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుక నెల మొదటిరోజైన మంగళవారం జిల్లాలో 54.13 శాతం పంపిణీ చేశారు. జిల్లాలో ఈనెల 2,66,348 మందికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయగా, తొలిరోజు 1,44,170 మందికి అందజేశారు. వలంటీర్లు తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ పంపిణీ చేశారు. లింగంగుంట్ల సచివాలయం-2 పరిధిలో పెన్షన్ల పంపిణీని డీఆర్డీఏ పీడీ బాలునాయక్ పరిశీలించారు. అక్కడే ఓ వృద్ధురాలికి పింఛన్ అందజేశారు.

నవోదయ ప్రవేశాలకు నోటిఫికేషన్

నరసరావుపేట ఈస్ట్: జవహర్ నవోదయ విద్యాలయాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ విడుదలైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని మండల విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని అర్హత గల విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరయ్యేలా చైతన్యపరచాలని కోరారు. ఆసక్తి గల విద్యార్థులు నవోదయ.జీటీవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఈనెల 10వతేదీలోగా సమర్పించాలని తెలిపారు. వివరాలకు ఆయా మండల విద్యాశాఖాధికారులను సంప్రదించాలని సూచించారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 2,010 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 500 క్యూసెక్కులు, తూర్పుకు 179, పశ్చిమకు 150, నిజాంపట్నంకు 225, కొమ్మమూరు కాల్వకు 1100 క్యూసెక్కులు విడుదల చేశారు.

సాగర్ నీటిమట్టం




విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 514.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో ధీరజ్ సత్తా



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీలో దివంగత చెరుకూరి లెనిన్ (ఇండియన్ ఆర్చరీ కోచ్) వద్ద శిక్షణ పొందిన బొమ్మదేవర ధీరజ్ జర్మనీలోని బెర్లిన్ నగరంలో జరుగుతున్న ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్ మెన్ విభాగంలో క్వాలిఫైయింగ్ రౌండ్‌లో 2వ ర్యాంక్ సాధించాడు. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ సోమవారం జరిగిన రికర్వ్ క్వాలిఫైయింగ్ రౌండ్‌లో 720 పాయింట్లకు గాను 683 పాయింట్లు సాధించి రెండో ర్యాంక్ సాధించాడు. ధీరజ్‌ను ఆయన తల్లిదండ్రులను, శిక్షకులను చెరుకూరి ఓల్గా అకాడమీ, ఏపీ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ అభినందిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.800, గరిష్ట ధర రూ.1,600, మోడల్ ధర రూ.1,200 వరకు పలికింది.

‘బ్రహ్మ’ండమైన అభివృద్ధి

- లోకేష్.. వినుకొండ పిలుస్తోంది రా
- ప్రగతితో ఆహ్వానం పలుకుతోంది చూడు
- బొల్లా బ్రహ్మనాయుడు స్వాగతం

టీడీపీ హయాంలో ఇదీ దుస్థితి



- గుక్కెడు నీటి కోసం ట్యాంకర్ల ముందు ప్రజల క్యూ
- రోడ్ల విస్తరణ చేయక అస్తవ్యస్తంగా ట్రాఫిక్
- వైద్య వసతుల్లేక ప్రజల ఇబ్బందులు
- విద్యా సౌకర్యాలు లేక విద్యార్థుల అవస్థలు
- పేదలకు గజం స్థలం ఇచ్చిన పాపాన పోలేదు
- ఆలయాల అభివృద్ధి శూన్యం

వైఎస్సార్ సీపీ పాలనతో ఇదీ మార్పు



- రూ.161 కోట్లతో ప్రజలకు రోజూ నీరు అందించేలా చర్యలు
- 100 పడకల స్థాయికి ప్రభుత్వ ఆస్పత్రి ఉన్నతీకరణ
- రూ.10 కోట్లతో మైనార్టీ గురుకుల పాఠశాల, కాలేజీ నిర్మాణం
- రూ.25 కోట్ల అంచనాలతో రామలింగేశ్వర స్వామి ఆలయం, ఘాట్ అభివృద్ధి పనులు
- ఆక్రమణలు తొలగించి రోడ్ల విస్తరణ, అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం
- రూ.21.95 కోట్లతో పేదలకు 5,118 ఇళ్ల నిర్మాణం

సాక్షి, నరసరావుపేట: గతంలో అర్ధరాత్రి అపరాత్రి లేకుండా తాగునీటి ట్యాంకర్ కోసం పట్టణవాసులు వెయ్యి కళ్లతో ఎదురుచూడాల్సిన దుస్థితి. ట్యాంకర్ రాగానే నీటి బిందెలతో ఓ చిన్నపాటి ‘పానీ’పట్టు యుద్ధమే జరిగేది. పట్టణ అవసరాలు పెరిగినా దశాబ్దాల క్రితం అవే రోడ్లు, ఆస్పత్రులు, పాఠశాలలు. మారుతున్న కాలం, పెరుగుతున్న అవసరాలను దృష్టిలో పెట్టుకొని తమ పాలనాకాలంలో ప్రజల అవసరాలు తీర్చాల్సిన టీడీపీ కేవలం ప్రజాధనాన్ని లూటీ చేయడానికే అధికారాన్ని ఉపయోగించింది. ట్యాంకర్ల మాటున తమ అక్రమార్జన దాహార్తిని తీర్చుకోగలిగారే తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపలేకపోయారనే తీవ్రారోపణలు ఉన్నాయి. ఎన్నికల సమయాన మా వర్గం బలీయమనే చాటింపులేసుకోవడమే తప్ప ఈ ప్రాంతాభివృద్ధికి, ప్రజల మేలుకు ఈసమంత ప్రయత్నమైనా చేయలేదనే ఆవేదనలు వినిపిస్తుంటాయి.

వైఎస్సార్ సీపీ పాలనలో నవశకం

నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో వినుకొండ రూపురేఖలు వేగంగా మారాయి. వినుకొండ పట్టణంతోపాటు నియోజకవర్గానికి నవశకం ఆరంభమైంది. పట్టణవాసుల దాహార్తి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపడంతో పాటు అన్ని రంగాలూ ప్రగతిపథాన ఉరకలెత్తుతున్నాయి. ‘‘లోకేష్... వినుకొండ పిలుస్తోంది రా! వచ్చి గత పాలనకు, ప్రస్తుత పాలనకు తేడా గమనించు. ప్రగతిని గుర్తించు. మార్పును స్వాగతించు. ప్రజలు మెచ్చే పాలన ఎలా అందించాలో వైఎస్సార్ సీపీ నుంచి నేర్చుకో’’అని పరిశీలకులు సూచిస్తున్నారు.

ట్యాంకర్ల ముందు బారులు

టీడీపీ ప్రభుత్వ పాలనలో పట్టణ ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్లు, ఒంటెద్దు బండ్లపై ఆధారపడేవారు. కాలనీలకు అవి వచ్చినప్పుడు బిందెలతో ట్యాంకర్ల చుట్టూ తోపులాటలు జరిగేవి. మూగచింతలపాడు డీప్ వద్ద నుంచి తరలించి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఆయన అనుచరులు బిల్లుల రూపంలో దోచుకునేందుకే మొగ్గుచూపారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం సాధ్యమైంది. 1.06 లక్షల పట్టణ జనాభాకు రోజుకు సరాసరి 7 మిలియన్ లీటర్ల నీరు అవసరం. గత ప్రభుత్వ హయాంలో సింగర చెరువు ఆక్రమణకు గురై 60 ఎకరాలకు చేరడంతో 120 నుంచి 150 మిలియన్ లీటర్ల లోపే నిల్వ ఉండేవి. వర్షాకాలంలో ఓ రెండు మూడు నెలలు మాత్రమే అవసరాలకు ఉపయోగపడేవి. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సింగర చెరువుకు ఆక్రమణల నుంచి విముక్తి కలిగించి 270 ఎకరాలకుపైగా విస్తరించి, రూ.60 లక్షలతో నీటి నిల్వకు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం 800 నుంచి 1,000 మిలియన్ల వరకు నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది. నీళ్ల ట్యాంకర్ల వద్ద బిందెలతో ఉండే దయనీయ దుస్థితి నుంచి విముక్తి కలిగింది. మరోవైపు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో భాగంగా రూ.161 కోట్లతో సాగర్ నుంచి గ్రావిటీ ద్వారా వినుకొండకు నీరు అందించే పనులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపుతున్నారు.



వినుకొండ పట్టణంలో జగనన్న కాలనీలో నిర్మాణాలు



కొత్తగా నిర్మించిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్యకేంద్రం భవనం

పెరిగిన విద్య, వైద్య వసతులు

గత పాలనలో విద్య, వైద్య రంగాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఈ ప్రభుత్వంలో రూ.10 కోట్లతో ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల పనులు జరుగుతున్నాయి. ఆక్రమణలకు గురైన డిగ్రీ కళాశాల భూమిని స్వాధీనం చేసుకొని 13 ఎకరాల చుట్టూ రూ.కోటితో ప్రహరీ నిర్మించారు. ఇందులో డిగ్రీ కళాశాల స్టేడియం నిర్మించనున్నారు. పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేయించారు. ఎస్టీ విద్యార్థుల కోసం రూ.18 కోట్లతో గురుకుల పాఠశాల నిర్మాణం మొదలు పెట్టారు. వినుకొండ పట్టణం, నియోజకవర్గంలోని 120 పంచాయతీల ప్రజలు మెరుగైన వైద్యం కోసం గతంలో 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిపైనే ఆధారపడేవారు. ఈ ప్రభుత్వంలో దాన్ని రూ.15 కోట్ల ఖర్చుతో 100 పడకల ఆస్పత్రిగా ఉన్నతీకరిస్తున్నారు. రూ.95 లక్షలతో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.

‘కొండ’ంత పురోభివృద్ధి..

వినుకొండపై ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లాలంటే నడకదారే దిక్కు. గత ప్రభుత్వ హయాంలో ఆలయ అభివృద్ధి జరగలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సుమారు రూ.25 కోట్ల అంచనాతో పనులు చేస్తున్నారు. ఇప్పటికే కొండపై ఘాట్‌రోడ్డు పనులు చేపట్టి తొలి ఏకాదశి రోజు కొండపైకి ఆర్టీసీ బస్సులను నడుపుతున్నారు. కొండ చుట్టూ రూ.2 కోట్లతో గిరిప్రదక్షణ రోడ్డు వేయనున్నారు. నూజెండ్ల వెళ్లే మార్గంలో రైల్వే గేట్ కష్టాలకు చెక్‌పెడుతూ రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి అందుబాటులోకి తెచ్చారు. నేడు లోకేష్ ఆ కొత్త బ్రిడ్జ్ ద్వారా నడవనున్నారు. ఎన్ఎస్పీ కాలువపై ఆక్రమణలు తొలగించి ఇరువైపులా పల్నాడు రోడ్డు, కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి కలిపే రోడ్లను నిర్మాణం చేపట్టి ట్రాఫిక్ కష్టాలు తీర్చారు. దశాబ్దాలుగా ఆక్రమణల చెరలో ఉన్న రోడ్లకు విముక్తి కల్పించి విశాలమైన రోడ్లను అందుబాటులోకి తెచ్చారు. కాలువచుట్టూ మొక్కలు నాటి సుందరీకరించారు. మున్సిపాలిటీ ఆర్థిక వనరులను పెంచేందుకు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేసి గదులను అద్దెకు ఇస్తున్నారు. ఎన్ఎస్పీ స్థలంలో మరో కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ అందుబాటులోకి రానుంది. రూ.1.28 కోట్లతో మలశుద్ధి కేంద్రం, రూ.1.11 కోట్లతో చెత్త నిర్వహణ కేంద్రాలను నిర్మిస్తున్నారు. ఇళ్లులేని పేదలందరికీ జగనన్న కాలనీలలో రూ.21.95 కోట్లతో 5,118 ఇళ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి ఎంతో. పాదయాత్రలో భాగంగా పట్టణంలో పర్యటిస్తున్న లోకేష్ కళ్లారా వినుకొండలో వచ్చిన మార్పు చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రగతిని కళ్లారా చూడు లోకేష్



లోకేష్, మీ నాన్న ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న మీరు, మీ మాజీ ఎమ్మెల్యే జీవీ వినుకొండకు ఇది చేశామని చెప్పుకోవడానికి ఏమీ లేదు. కేవలం ప్రజాధనాన్ని దోచుకునేందుకే సమయం కేటాయించారు. మా ప్రభుత్వంలో మా బ్రాండ్ ఇది అని చెప్పుకొనేలా పట్టణాన్ని అభివృద్ధి చేశాం. కొత్తగా కట్టిన అండర్ గ్రౌండ్ బ్రిడ్జి, విస్తరించిన రోడ్లు, కాలువ కట్ల సుందరీకరణ, 100 పడకల ఆస్పత్రి, మంచినీటి సమస్య పరిష్కారం, కొండ ఘాట్‌రోడ్డు, జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు స్వాగతం పలుకుతున్నాయి. వాటిని కళ్లారా చూసి మా పరిపాలనా తీరు తెలుసుకో.

– బొల్లా బ్రహ్మనాయుడు, వినుకొండ ఎమ్మెల్యే.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవం

గుంటూరు లీగల్: కుటుంబ కలహాల నేపథ్యంలో జరిగిన హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ రెండో అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి వి.ఎ.ఎల్. సత్యవతి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు నిందితుడు పాలపర్తి శ్రీనివాసరావు తాడికొండ మండలంలోని మల్లవరంలో నివాసం ఉంటూ విజయవాడలోని ఎన్‌హెచ్‌డీసీ లిమిటెడ్‌లో కమర్షియల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. మృతుడు కుంభ కోటేష్ అలియాస్ కోటేశ్వరరావు అలియాస్ కిరసనాయిల్ కోటయ్య తాడికొండలోని లైబ్రరీ సెంటర్‌లో తన కూతురు బి.రాములమ్మ, మనుమరాలు పాలపర్తి శివ లీల రాణితో నివాసం ఉంటున్నాడు. శ్రీనివాసరావును రాణి ప్రేమించింది. ఈ విషయాన్ని కోటేష్ గ్రామ పెద్దలు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో చివరికి వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు సంతానం కలిగారు. కాల క్రమంలో రాణి తన తల్లికి మేనల్లుడు అయ్యే శివ శంకర్‌తో సన్నిహితంగా ఉంటుందని అనుమానం పెంచుకున్న శ్రీనివాసరావు ఆమెను శారీరకంగా, మానసికంగా హింసించడం ప్రారంభించాడు. దీనిపై తరచూ వివాదాలు జరగడంతో కోటేష్ జోక్యం చేసుకుని గ్రామ పెద్దలు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. ఈ నేపథ్యంలో భార్యాభర్తలు విడిపోయారు. కోటేష్ చెబితేనే మళ్లీ కాపురానికి వస్తానని రాణి తేల్చి చెప్పడంతో శ్రీనివాసరావు కోటేష్‌పై కక్ష పెంచుకున్నాడు. 2015 మే 30న కూరగాయలు కోసే కత్తితో మెడ, తలపై విచక్షణారహితంగా కోటేష్‌ను నరికాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కూతురు రాములమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాడికొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

ఎస్పీ ప్రత్యేక అభినందనలు

ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష పడేలా చేసిన డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మధుసూదనరావు, ఏపీపీ మాతంగి శ్రీకాంత్, అప్పటి సీఐ చిట్టెం కోటేశ్వరరావు, కోర్టు కానిస్టేబుల్, కోర్టు మానిటరింగ్ సిబ్బందిని గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ ప్రత్యేకంగా అభినందించారు.

కోడెల వర్గీయులు 16 మందికి నోటీసులు

- ఇన్‌చార్జి కన్నాకు సహకరించకుంటే చర్యలు తప్పవని జీవీ హెచ్చరికలు
- కోడెల శివరామ్, కన్నా వర్గాల మధ్య విభేదాలపై అధిష్టానానికి ఫిర్యాదు
- నేడు పార్టీ అసమ్మతి నేతలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించనున్న చంద్రబాబు

సత్తెనపల్లి: కోడెల వర్గీయులు 16 మందికి టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు నోటీసులు జారీచేశారు. ఇటీవలే పార్టీలో చేరి సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేజిక్కించుకున్న కన్నా లక్ష్మీనారాయణకు సహకరించపోతే తీవ్ర చర్యలు తప్పవని ఆంజనేయులు స్పష్టంచేశారు. దీంతో టీడీపీలో అంతర్గత విభేదాలు మరోసారి బట్టబయలయ్యాయి.

లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర పల్నాడు జిల్లాలోకి ప్రవేశించిన సందర్భంగా విభేదాలు మళ్లీ భగ్గుమనడంతో పార్టీలో తీవ్ర చర్చ జరుగుతోంది. గత నాలుగు సంవత్సరాలుగా కోడెల శివరాం నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు, తెలుగు యువత నాయకుడు మన్నెం శివనాగ మల్లేశ్వరరావు (అబ్బూరు మల్లి) వేర్వేరుగా పార్టీ కార్యక్రమాలు చేపట్టారు. ఒక్కసారిగా కన్నాకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో మూడు కాస్త నాలుగు వర్గాలయ్యాయి. అయితే మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు ఈ ప్రాంత రాజకీయాలకు గుడ్ బై చెప్పారు. మన్నెం శివ నాగమల్లేశ్వరరావు కన్నాతో కలిసి పనిచేయనున్నట్లు చెప్పి ఆయన సొంత పనుల్లో నిమగ్నమయ్యారు. కోడెల శివరాం మాత్రం పట్టుదలతో ఉన్నారు. తన తండ్రి కోడెల శివప్రసాదరావు ఆశయ సాధనకు, తమకు ఎల్లవేళలా అండగా నిలిచిన కార్యకర్తలకు వెన్నుదన్నుగా ఉండాలని పార్టీ కార్యక్రమాలను స్వతహాగా కొనసాగిస్తున్నారు. దీన్ని జీర్ణించుకోలేని కన్నా తాను ఇన్‌చార్జి అయినా తనకు అందరూ సహకరించడం లేదని అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ మంగళవారం కన్నాకు సహకరించని కోడెల వర్గీయులు 16 మందికి నోటీసులు జారీ చేశారు. ఇన్‌చార్జికి సహకరించకపోతే చర్యలు తప్పవని హెచ్చరికలు చేయడంతో విభేదాలు మరోసారి తార స్థాయికి చేరినట్లు అయింది.

అయితే పార్టీ అసమ్మతి నేతలతో టీడీపీ అధినేత చంద్రబాబు బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు తెలిసింది. ఈ టెలికాన్ఫరెన్స్‌కు సైతం చాలా మంది దూరంగా ఉండనున్నట్లు పార్టీవర్గాల సమాచారం. ఎంతమంది హాజరవుతారనేది తెలియక మల్లగుల్లాలు పడుతున్నారు. కన్నా చేపట్టే కార్యక్రమాలకు తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించేది లేదని కోడెల వర్గీయులు ఇప్పటికే అధిష్టానానికి తేల్చిచెప్పారని పార్టీవర్గాలు అంటున్నాయి.

జగనన్న సురక్ష జయప్రదం

కలెక్టర్ శివశంకర్



నరసరావుపేట: పల్నాడు జిల్లాలో జగనన్న సురక్ష పథకం జయప్రదమైందని, దీనిలో భాగంగా ఇంటింటి సర్వే లక్ష్యం 97 శాతం సాధించామని కలెక్టర్ శివశంకర్ లోతేటి చెప్పారు. పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 538 సచివాలయాల ద్వారా 10,770 మంది వలంటీర్లు జూన్ 24 నుంచి జూలై 31 వరకు సర్వే నిర్వహించారని వివరించారు. ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా 1,54,033 దరఖాస్తులు వచ్చాయని, అందులో 1,43,755 అర్జీలను పరిశీలించి 1,38,498 ధ్రువీకరణ పత్రాలను జారీచేశామని వెల్లడించారు. మిగిలిన 5,257 దరఖాస్తుల్లో 4,974 వినతులు ఆధార్ కార్డుల పేర్ల తప్పులు, ఫోన్ నంబర్ల తప్పులు, పుట్టిన, మరణ తేదీల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించినవి ఉన్నాయని వివరించారు. నిర్దిష్ట కాలపరిమితిలోపు మిగిలిన దరఖాస్తులూ పరిష్కరిస్తామని చెప్పారు. పథకం విజయవంతంలో భాగస్వాములైన ఉద్యోగులు, వలంటీర్లకు అభినందనలు తెలిపారు. సమావేశంలో జిల్లా అభివృద్ధి అధికారిణి మహాలక్ష్మి, కలెక్టరేట్ ఏఓ అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

మహారాజ ‘పోషణ’

- నేటి నుంచి ఇంటికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు
- పకడ్బందీగా పథకం అమలు
- అంగన్‌వాడీ కేంద్రాలకు చేరుకుంటున్న కిట్లు
- సంచిలో పది రకాల సరుకులు

జిల్లాలో ఇలా..	
ఐసీడీఎస్ ప్రాజెక్టులు	: 6
అంగన్‌వాడీ కేంద్రాలు	: 1,480
గర్భిణులు	: 12,823
బాలింతలు	: 9,878



పంపిణీకి సిద్ధం చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గర్భిణులు, బాలింతలు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కోసం ఇక అంగన్‌వాడీ కేంద్రాల్లో పడిగాపులు పడాల్సిన అవసరం లేదు. దర్జాగా ఇంటి వద్దే ఉండి సరుకులు తీసుకోవచ్చు. ప్రభుత్వం వీరి సౌలభ్యం కోసం విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రతినెలా రెండుసార్లు వీరికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరుకులను ఇంటికే పంపాలని నిర్ణయించింది. బుధవారం నుంచి దీనిని అమల్లోకి తీసుకురానుంది.

15 కేజీల బ్యాగులో పది రకాల వస్తువులు

జిల్లాలోని 1,480 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్న విషయం తెలిసిందే. ఈ కేంద్రాల ద్వారానే ప్రతి నెలా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు లబ్ధిదారులకు అందుతున్నాయి. తాజాగా లబ్ధిదారుల ఇళ్లకే కిట్లను పంపే ఉద్దేశంతో ప్రభుత్వం 15 కేజీల బ్యాగులో పది రకాల వస్తువులు కలిగిన కిట్లను సరఫరా చేస్తోంది. ఇవి ఇప్పటికే కేంద్రాలకు చేరుకుంటున్నాయి.

పంపిణీ చేసే సరుకులు ఇలా..	
రైస్	: 3 కిలోలు
కందిపప్పు	: కిలో
అటుకులు	: కిలో
రాగి పిండి	: కిలో
పామాయిల్	: 500 ఎంఎల్
పాలు	: 2.5 లీటర్లు
బెల్లం	: 250 గ్రాములు
వేరుశనగ చిక్కి	: 250 గ్రాములు
ఎండు ఖర్జూరం	: 250 గ్రాములు
కోడిగుడ్లు	: 30

గత ప్రభుత్వంలో అవస్థలు

గత ప్రభుత్వంలో ఇచ్చిన అరకొర సరుకుల కోసం గర్భిణులు, బాలింతలు గంటల తరబడి అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పడిగాపులు పడాల్సి వచ్చేది. దీంతో వేచి ఉండలేక బాలింతలు, గర్భిణులు అవస్థలు పడేవారు. నెలలు నిండిన గర్భిణుల పరిస్థితి మరింత దయనీయంగా ఉండేది. సరుకుల నాణ్యత బాగుండేది కాదు. తూకాల్లో తేడా ఉండేది.



అంగన్‌వాడీ కేంద్రంలో మహిళకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మార్పు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక గర్భిణులు, బాలింతలు ఎక్కువ సేపు వేచి ఉండకుండా చర్యలు చేపట్టారు. నాణ్యమైన సరుకులు ఇచ్చే ఏర్పాట్లు చేశారు. నెలలు నిండిన గర్భిణులకు ఇళ్లకే తీసుకెళ్లి ఇచ్చేలా చర్యలు చేపట్టారు. ఇప్పుడు తాజాగా మరో అడుగు ముందుకేసి బాలింతలు, గర్భిణులు అందరికీ ఇళ్లకే పది రకాల సరుకుల కిట్లు పంపిణీకి శ్రీకారం చుడుతున్నారు. దీనికోసం అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి లబ్ధిదారులు సరుకులు తీసుకున్నారో లేదో తెలిసేలా ఫొటోలు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఫలితంగా మహిళా లోకం నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

పారదర్శకంగా పంపిణీ



వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా టేక్ హోం రేషన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం 10 రకాల సరుకులతో కూడిన బ్యాగ్‌ను అర్హులైన వారికి పారదర్శకంగా అందజేస్తాం.

– బి.మనోరంజనీ, పీడీ, ఐసీడీఎస్, గుంటూరు

మొదటిరోజు 32,397మందికి రేషన్ పంపిణీ



పట్టణంలోని ప్రకాష్‌నగర్ స్వామి స్కూలు వద్ద ఫోర్టిఫైడ్ రేషన్ బియ్యం, గోధుమ పిండిని పరిశీలిస్తున్న డీఎస్‌వో పద్మశ్రీ

నరసరావుపేట: ప్రజల ఆహార భద్రత కింద ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా జిల్లాలో రేషన్ షాపుల ద్వారా ఎండీయూ వాహనాలతో ఈనెల నుంచి నూతనంగా పంపిణీ చేస్తున్న ఫోర్టిఫైడ్ రైస్, గోధుమ పిండితోపాటు పంచదారను మంగళవారం సాయంత్రానికి 32,397మందికి పంపిణీ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ వెల్లడించారు. నరసరావుపేట పట్టణం, రూరల్ ప్రాంతాల్లో ఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసరాల పంపిణీని మంగళవారం ఆమె పరిశీలించారు. సరుకులు తీసుకునేందుకు వచ్చిన కార్డుదారులకు ఫోర్టిఫైడ్ రైస్ వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. గోధుమ పిండి ప్యాకెట్ కేవలం పట్టణ ప్రాంతాల్లోని లబ్ధిదారులకే పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లోని 1289 రేషన్ షాపుల ద్వారా 402 ఎండీయూ వాహనాలతో 6,36,405మంది కార్డుదారులకు ఈనెల 17వ తేదీ లోగా రేషన్ పంపిణీ పూర్తిచేయనున్నట్లు వెల్లడించారు.

'ఆడుదాం ఆంధ్రా' ఆటలకు లోగోలు పంపండి

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 2వ తేదీనుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా ఆటలకు సంబంధించిన లోగో పోటీలను నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ ఎస్.పల్లవి, చీఫ్ కోచ్ పి.అఫ్రోజ్‌ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రతిష్టను ఇనుమడింప చేసేలా లోగో తయారు చేసిన వారికి ప్రభుత్వం నగదు బహుమతులు అందిస్తుందని తెలిపారు. ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ రూ.30వేలు, తృతీయ బహుమతి రూ.20వేలు అందిస్తుందని వివరించారు. బాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాంశాలలో లోగోలను తయారు చేయాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోగా తమ లోగోలను స్పోర్ట్స్.ఏపీ.జీఓవి.ఇన్ వైబ్‌సైట్‌కు ఆన్‌లైన్‌లో పంపాలని సూచించారు. వివరాలకు 8143143222లో సంప్రదించాలని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలి

డీపీఎం అమలకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం కె.అమలకుమారి

నరసరావుపేటరూరల్: ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు వెళ్లే విధంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత మహిళా సంఘాలపై ఉందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అమలకుమారి మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటుచేసి ప్రకృతి వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం వనరుల కేంద్రాన్ని ఏర్పాటుచేసి రైతులకు కావాల్సిన కషాయాలను అందజేయాలని తెలిపారు. ప్రస్తుత కాల పరిస్థితుల్లో రసాయనాలు లేకుండా సహజ సిద్ధమైన ఎరువులతో నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం కషాయాలను పంటలపై పిచికారీ చేయడం ద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించవచ్చని తెలిపారు. ఇంటి పరిసరాల్లో ఖాళీగా ఉన్న స్థలంలో సూర్యమండలం విధానంలో దుంప, తీగజాతి, ఆకుకూరలు, పండ్ల మొక్కలను నాటి సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసుకోవచ్చన్నారు. దీని ద్వారా నెలకు రూ.2వేలు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఆర్‌బీకేల్లో అంతర పంటలకు, సరిహద్దు పంటలు వేసుకోవడానికి అవసరమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ వెంకట్రావు, డీపీఎం ప్రేమ్‌రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నిర్విరామ భక్తి గీతాలాపన

- 12 గంటల పాటు 'నీ గానమే నా ప్రాణం'
- కర్ణాటక నుంచి వచ్చిన గురుస్వాములు



భక్తిపాటల కార్యక్రమంలో పాల్గొన్న గాయకులు, అమ్మవారి వేషధారణలు

చినగంజాం: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో 'నీ గానమే నా ప్రాణం' అనే అయ్యప్పస్వామి భక్తి పాటల కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకర్షించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు 27 కార్యక్రమాలు నిర్వహించి 28వ కార్యక్రమాన్ని చినగంజాంలో అయ్యప్పస్వామి భక్తి గీతాల గాయకుడు మున్నం లక్ష్మణ్‌రెడ్డి స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. పూజా కార్యక్రమాలు అనంతరం ఉదయం 6 గంటలు నుంచి సాయంత్రం 6 గంటల వరకు అఖండ నామ సంకీర్తన అయ్యప్పస్వామి భక్తి పాటలు కార్యక్రమం నిర్విరామంగా 12 గంటల పాటు నిర్వహించారు. పలు వేషధారణలు నాట్యాలతో ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన అయ్యప్పస్వామి భక్తి పాటల గాయకులు దప్పు శ్రీను, శివగురు, గౌరిశంకర్, హరినాథగురు, భాస్కర, రెపల్లె ఎస్వీ, వాసు, కుమారస్వామి, మల్లితో పాటు పలువురు గాయకులు పాల్గొన్నారు. పూజ్య గురుస్వాముల ఆత్మీయ సమ్మేళనం, అతిథులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. అఖండ భజన కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటకతో పాటు రెండు రాష్ట్రాల్లోని గురుస్వాములు, అయ్యప్ప భక్తులు, ప్రముఖ గాయకులు కార్యక్రమానికి విచ్చేసి ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు.

పీటీడీ ఉద్యోగులకు పాత సదుపాయాలు పునరుద్ధరించాలి

ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు, వేదికపై యూనియన్ ప్రతినిధులు

నరసరావుపేట: ఆర్టీసీ ఉద్యోగులు పీటీడీ ఉద్యోగులుగా మారిన తర్వాత రద్దయిన ఆర్టీసీ పాత సదుపాయాలను తిరిగి పునరుద్ధరించాలని ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.దామోదరరావు కోరారు. మంగళవారం ప్రకాష్ నగర్‌లోని సప్తపది కల్యాణ మండపంలో జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాజా అధ్యక్షతన నిర్వహించిన యూనియన్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాత సర్వీస్ రూల్స్ సాధన కోసం కృషి చేస్తున్నామని, ఏపీ జేఏసీ అమరావతి సంఘంతో కలిసి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టి తీసుకొనిపోయి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య మాట్లాడుతూ క్యాడర్ బలోపేతంలో ఉత్పన్నమైన సమస్య పరిష్కారం కోసం యూనియన్ కృషిచేస్తుందన్నారు. ఉద్యోగులలో ఉన్న ఈ సమస్యను పరిష్కరించాల్సిన భాద్యత యాజమాన్యంపై ఉందన్నారు. డెప్యూటీ జీఎస్ జి.నారాయణరావు మాట్లాడుతూ జీవో నం.70, 71 ద్వారా సీసీఏ రెగ్యులేషన్సులో ఉన్న విషయాలను ఉద్యోగులకు తెలియజేశామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శంకరరావు, ఎం.కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ఎన్వీ.కృష్ణారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.కోటేశ్వరరావు, నెల్లూరు జోనల్ కార్యదర్శి డి.బాబు శామ్యూల్, జిల్లా కార్యదర్శి తిరుమలరావు, పల్నాడు జిల్లాలోని అన్నీ డిపో కార్యదర్శులు ప్రసంగించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, కోశాధికారి జానీ, యూనియన్ నాయకులు ఆసీఫ్, జీటీ రావు, రాయల్‌బాబు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి

ఆర్జేడీ వి.ఎ.ఎస్.సుబ్బారావు



మాట్లాడుతున్న ఆర్జేడీ సుబ్బారావు, చిత్రంలో డీఈఓ పి.వి.జె.రామారావు

బాపట్ల అర్బన్: ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు రోల్‌మోడల్‌గా నిలిచి మంచిపౌరులను సమాజానికి అందించాలని ఆర్జేడీ వి.ఎ.ఎస్.సుబ్బారావు అన్నారు. సమగ్రశిక్ష అభియాన్ సమావేశ మందిరంలో మూడో విడత ప్రాంతీయ జిల్లాల సెకండరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమం బాపట్లలోని విస్తరణ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఆర్జేడీ సుబ్బారావు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం డీఈఓ పీవీజే రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గుణాత్మక విద్యను అందించాలన్నారు. రాష్ట్ర పరిశీలకురాలు కల్పన మాట్లాడుతూ బోధన పర్యవేక్షణ పద్ధతులు, పాఠ్యప్రణాళికలు ఐసీటీపై డీఆర్‌పీలు చక్కగా శిక్షణ పొందాలని సూచించారు. ప్రాంతీయ విద్యా సంచాలకులు వి.ఎస్.సుబ్బారావుతో పాటుగా సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు ఏడు నామినేషన్లు

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థ స్థాయి సంఘ (స్టాండింగ్ కమిటీ) ఎన్నికల్లో ఏడుగురు నామినేషన్లు వేశారని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీకి ఆగస్టు 11న ఎన్నిక జరుగుతుందన్నారు. మంగళవారం నామినేషన్ గడువు సమయానికి ఏడుగురు నామినేషన్లు వేశారని, బుధవారం నామినేషన్ల స్క్రూట్నీ నిర్వహించి, అర్హత కల్గిన వారి లిస్టును అదేరోజు పబ్లిష్ చేస్తామని తెలిపారు. ఆగస్టు 7 వరకు నామినేషన్ల ఉపసంహరణ చేసుకోవడానికి గడువు ఉందని, అదేరోజు ఫైనల్ లిస్టు పబ్లిష్ చేయడం జరుగుతుందన్నారు. ఆగస్టు 11న నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, అదేరోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించడం జరుగుతుందన్నారు. స్టాండింగ్ కమిటీకి శ్యామల వెంకట రమణాదేవి(26వ వార్డు), అడకా పద్మావతి (24), మల్లిబోయిన శ్రీవల్లి (51), సంకూరి శ్రీనివాసరావు (13), పాపతోటి అంబేడ్కర్ (54), కంద్రగుంట గురవయ్య (21), షేక్ మహమూద్ (4)లు నామినేషన్లు వేశారు.

రేపు ఇన్‌స్పైర్ మానక్ శిక్షణ తరగతులు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్యాలలో పనిచేసే పాఠశాలల గైడ్ టీచర్లకు ఇన్‌స్పైర్ మానక్–23 శిక్షణా తరగతులను ఈనెల 3వ తేదీ గురువారం లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల నుంచి ఒక సైన్స్ గైడ్ టీచర్ తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. ఇన్‌స్పైర్ మానక్–23 నామినేషన్లు, యూజర్ ఐడి, మెయిల్ అడ్రస్, ఫోన్ నెంబర్ మార్పు తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని వివరించారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్, ప్రాజెక్టుల రూపకల్పన, పర్యావరణ పరిరక్షణ అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడిని తరగతులకు పంపాలని తెలిపారు.

కారు డ్రైవర్ శ్రీకాంత్‌పై పోక్సో, కిడ్నాప్ కేసు

సత్తెనపల్లి: మాయమాటలతో బాలికను మోసగించిన కారు డ్రైవర్ శ్రీకాంత్‌పై పోక్సో, కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ యు.శోభన్‌బాబు మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని వడ్డవల్లి ప్రాంతానికి చెందిన బాలిక ఆరో తరగతి వరకు చదువుకొని ఆపేసి ఇంటి వద్ద ఉంటోంది. ఆమెను పట్టణంలోని రాజుల కాలనీకి చెందిన కారు డ్రైవర్ భోగ్యం శ్రీకాంత్ మాయమాటలతో మోసగించి శారీరకంగా గత నెల 30న అనుభవించాడు. దీనిపై ఆమె ఫిర్యాదు మేరకు శ్రీకాంత్‌పై పోక్సో, కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి పల్నాడు జిల్లా దిశ డీఎస్పీ రవిచంద్ర దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యార్డుకు 40,626 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 40,626 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 38,322 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.12,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.12,900 నుంచి 24,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,212 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

అచ్చంపేటలో అత్యధిక వర్షపాతం

- అత్యల్పంగా రొంపిచర్ల మండలం
- ఆరు మండలాల్లోనే సాధారణ వర్షపాతం

నరసరావుపేట: జిల్లాలో జూలై మాసంలో అచ్చంపేట మండలంలో అత్యధికంగా 251.6 మి.మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా రొంపిచర్ల మండలంలో 43.0మి.మీ వర్షం నమోదైంది. మొత్తం 28 మండలాల్లో కేవలం ఆరు మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైంది. రెంటచింతల 129.0 మి.మీ, బెల్లంకొండలో 177.8 మి.మీ, అచ్చంపేటలో 251.6 మి.మీ, పెదకూరపాడులో 183.6 మి.మీ, బొల్లాపల్లిలో 110.2, ఈపూరులో 158.0 మి.మీ వర్షం కురిసింది. జిల్లాలో సాధారణ వర్షం 3666.7 మి.మీ కురవాల్సివుండగా 2993.2 మి.మి.వర్షమే కురిసింది. ప్రతి మండలంలో సరాసరి సగటున 131.0 మి.మి పడాల్సి ఉండగా కేవలం 106.9 మి.మీ వర్షం కురిసింది. మండలాల వారీగా 31రోజుల్లో పడిన వర్షంను పరిశీలిస్తే.. మాచర్లలో 72.8 మి.మీ, వెల్దుర్తి 70.2, దుర్గిలో 87.8, గురజాలలో 119.6, దాచేపల్లిలో 93.2, కారంపూడిలో 68.0, పిడుగురాళ్లలో 90.0, మాచవరంలో 92.6, క్రోసూరులో 148.8, అమరావతిలో 164.6, సత్తెనపల్లిలో 127.8, రాజుపాలెంలో 101.8, నకరికల్లులో 81.8, వినుకొండలో 66.6, నూజెండ్లలో 81.2, శావల్యాపురంలో 79.5, నరసరావుపేటలో 83.4, ముప్పాళ్లలో 84.0, నాదెండ్లలో 57.6, చిలకలూరిపేటలో 84.8, యడ్లపాడులో 83.2 మి.మీటర్ల వర్షం కురిసింది.

10న నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 10వ తేదీన జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఓప్రకటనలో తెలిపారు. ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.

గృహ నిర్మాణ లక్ష్యాలు పూర్తిచేయాలి

హౌసింగ్ పీడీ వరప్రసాదరావు

చినగంజాం: గృహ నిర్మాణాల లక్ష్యాలను హౌసింగ్ సిబ్బంది త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ వరప్రసాదరావు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన మండల పరిషత్ సమావేశం భవనంలో హౌసింగ్ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణాలు పూర్తి చేసే విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం చేయవద్దని, నిర్ణయించిన లక్ష్యాలను వీలైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.పార్వతి, ఎంపీడీఓ కె.స్వరూప రాణి, ఏడీ మురళి, ఏఈ రాజశేఖర్, సీసీ శ్రీనివాసరావు, ఉపాధి హామీ ఏపీఓ లక్ష్మీదేవి, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ జోసెఫ్ పాల్గొన్నారు.

నీటి పైపు విషయంలో ఘర్షణ.. వ్యక్తికి కత్తిపోట్లు

మార్టూరు: నీటి పైపు విషయమై తలెత్తిన వివాదంలో ఓ వ్యక్తి కత్తిపోట్లకు గురయ్యాడు. ఈఘటన మార్టూరు సుగాలి తండాలో సోమవారం రాత్రి జరిగింది. సీఐ ఎస్‌కే టి.ఫిరోజ్ వివరాల మేరకు.. స్థానిక సుగాలి తండాలో బాణావత్ శ్రీనునాయక్‌కు అదే కాలనీకి చెందిన సువార్తబాయితో నీటి పైపు విరిగిన విషయమై మాటామాటా పెరిగి సోమవారం సాయంత్రం వివాదం జరిగింది. రాత్రికి విషయం తెలిసిన సువార్తబాయి కుమారుడు అశోక్ తల్లితో కలిసి శ్రీనునాయక్‌తో ఘర్షణ పడి పరదాలు కుట్టుకునే కత్తెరతో శ్రీను నాయక్ భుజం, వీపుపై పొడిచాడు. దాడిలో గాయపడిన శ్రీను నాయక్‌ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అర్ధరాత్రి ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జీడిమామిడి సాగుకు ప్రోత్సాహం

వేటపాలెం: ఉద్యాన పంటలైన మామిడి, జీడిమామిడి తోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి జెన్నమ్మ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో ఐసీడీఎస్ హాల్లో జీడి మామిడి, మామిడి సాగుపై ఎస్‌సీఎస్‌పీ జీడిమామిడి పరిశోధన ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆమె జీడిమామిడి సాగులో వచ్చే పురుగులు, చీడపీడలు, వాటి నివారణ గురించి వివరించారు. పంటల యాజమాన్యం, ఎరువుల వినియోగంపై సీనియర్ శాస్త్రవేత్త ఉమామహేశ్వరరావు వివరించారు. వివిధ పంట సాగులో డ్రిప్, స్ప్రింక్లర్, మినీ స్ప్రింక్లర్లను ఉపయోగించుకొని సక్రమంగా నీటి యాజమాన్యం చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం రాయితీపై సూక్ష్మ సేద్యం పరికరాలు అందిస్తుందని, రైతులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ రమణ తెలిపారు. మండల ఉద్యానశాఖ అధికారి అలేఖ్య ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. కొత్తగా జీడి మామిడి, మామిడి రైతులు ఎవరైనా ఉంటే వారి వివరాలను వ్యవసాయ శాఖ అధికారులకు అందజేయాలన్నారు. వారికి రాయితీ పథకాన్ని వర్తింపజేసే విధంగా కృషిచేస్తామన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, ఏఓ ఐ.కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.